

విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

## ఆర్‌కె ఇంజనీరింగ్ కళాశాలలో

# మెగా జాబ్‌మేళా

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 2 (కెఎన్ఎన్):** మండలంలోని కేతనకొండ ఆర్‌కె ఇంజనీరింగ్‌కళాశాలలో ఆదివారం మెగాజాబ్‌మేళా నిర్వహించారు. 14 కంపెనీల హెచ్ ఆర్‌లు వివిధ కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులను వివిద పద్దతులలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఉదయం 9గంటలకు కార్యక్రమం ప్రారంభమయింది. టక్ మహేంద్రతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహి స్తున్నారు. వివిద ప్రాంతాల నుంచి 700 మంది హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య విద్యార్థుల నుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఇంటర్వ్యూలు జరుగు తునే ఉన్నాయని ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయో తెలియజేస్తామని కళా శాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవాడ ఆంధ్రప్రభ
Mon, 03 April 2017
epaper.prabhanews.com//c/18021511

ప్రజాశక్తి



మోగా జాబ్ మేళాకు
హాజరైన నిరుద్యోగులు

# ఆర్‌కె కళాశాలలో మెగా జాబ్‌మేళా

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం**

ఆర్‌కె కాలేజ్ ఆఫ్ ఇంజనీర్ కళాశాలలో ఆదివారం మోగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 14 కంపెనీ హెచ్‌ఆర్‌లు వివిధ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులను వివిధ పద్ధతులలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. టెక్ మహేంద్ర, పోలార్స్, ఏజిస్, బిగ్‌సి, ఎలియస్ గ్రూప్, రిస్‌క్యూన్ ఇన్‌పోటెక్, సందీప్ కెమికల్స్, జిజె సోల్యూషన్స్, టాటా బియస్‌యస్, కార్వే అండ్ జాస్పర్ ఇండస్ట్రీస్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్‌మేళాకు మొత్తం 700 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణ తెలిపారు.

# ప్రతిభతోనే ఉద్యోగావకాశాలు

**కేతనకొండ(ఇబ్రహీంపట్నం):** ప్రతిభ ఆధారంగానే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు దక్కుతాయని ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణయ్య అన్నారు. స్థానిక కళాశాలలో మెగా జాబ్‌మేళాను ఆదివారం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్, వృత్తిపట్ల అంకితభావం, కష్టపడేతత్వం, ఇంగ్లిష్‌పై పట్టు ఉంటే ఉద్యోగాలు సులువుగా లభిస్తాయన్నారు. జాబ్ మేళాకు వివిధ ప్రాంతాల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొనగా, స్థానిక కళాశాల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.



సాక్షి
Mon, 03 April 2017
epaper.sakshi.com//c/18021191

# ఆర్.కె.ఇంజనీరింగ్ కాలేజిలో మెగా జాబ్‌మేళ

ఇబ్రహీంపట్నం ఏప్రిల్ **2** ప్రభాతవార్త

కేతనకొండలోని ఆర్.కె.ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో వివిధ ప్రాం తాల నుంచి వచ్చిన 500 మంది విద్యార్థులు,కళాశాలలోని బి.టెక్,ఎం.బి.ఎ,పాలిటెక్నిక్ విభా గాల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు.వీరికి టెక్,మహేంద్ర వంటి 14 కంపెనీలు గ్రూప్ డిస్కసన్స,ఆన్‌లైన్ పరీక్షలు,ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారు.కళాశాల కార్యదర్శి డా.ఎం. మహేంద్రనాథ్,ప్రిన్సిపాల్ డా.కె.రామకృష్ణయ్యలు జాబ్‌మేళాను ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపకులు వివిధ కంపెనీలకు చెందిన హెచ్.ఆర్.మేనేజరులు పాల్గొన్నారు.

Mon, 03 April 2017
epaper.vaartha.com//c/18022025

## ప్రతిభకు పదును పెట్టండి

**కేతనకొండ(ఇబ్రహీంపట్నం):** ప్రాంగణ ఎంపికల్లో పాల్గొని తమలోని ప్రతిభకు విద్యార్థులు పదును పెట్టుకోవాలని ఆర్‌కే కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ అన్నారు. కళాశాల ఆవరణలో ప్రాంగణ ఎంపికలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 14 కంపెనీలకు చెందిన ప్రతినిధులు తమకు కావాల్సిన అభ్యర్థుల గురించి పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఇది బాగా ఉపయోగపడుతుందని తెలిపారు. 700 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో పాల్గొన్నారని తెలిపారు.

# మైలవరం




# జీవం పోయాక జలం!

**మైలవరం, న్యూస్‌టుడే**

రహదారుల పక్కన నీడకోసం నాటిన మొక్కలకు రక్షణ కరవైంది. పెంపకంపై నిర్లక్ష్యం రాజ్యమేలటంతో నాటిన వాటిలో సగం మొక్కలు ఏడాదిలోనే మాయమయ్యాయి. బతికున్న వాటిలో నీడ కాదు కదా, కనీసం నేలను దాటి పైకి ఎదగటమే గగనమైపోయింది. తీరా మొక్కల్లో సగం మాయమయ్యాక నీళ్లపోతకు అనుమతులు ఇస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గతేడాది గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట మొక్కల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ ప్లాంటేషన్ పేరిట వివిధ రకాల నీడనిచ్చే మొక్కలను నాటించారు. అటవీశాఖ నర్సరీల్లో పెంచిన మొక్కలనే వేల సంఖ్యలో నాటారు. నాటిన అనంతరం వాటికి రక్షణగా కనీసం ముళ్ల కంపతో ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా చాలా చోట్ల నిర్లక్ష్యం వహించారు. కంపను ఏర్పాటు చేసిన చోట పెంపకంపై శీత కన్నేశారు. మండల పరిధిలో మొర్సుమిల్లి నుంచి మొర్సుమిల్లి తండా రహదారిలో, చంద్రగూడెంలో, వెల్వడం నుంచి తోలుకోడు రహదారి పక్కన గతేడాది మొక్కలను నాటారు. ఆయా గ్రామాల పరిధిలో మొత్తం 1100 మొక్కలకు పైగా నాటించారు. గోతులు తవ్వకం, మొక్కలు నాటడానికి రూ.75 వేలు ఖర్చు చేశారు.

## ఇదీ మొక్కల పెంపకం తీరు



వెల్వడం- తోలుకోడు రహదారి పక్కన మోడుగా మారిన మొక్క



మొర్సుమిల్లి తండా రోడ్డులో కంప వేసినా ఎదగని మొక్క

### పెంపకంపై నిర్లక్ష్యం

మొక్కలు నాటి దాదాపు ఏడాది కావస్తున్నా, నేటికీ సరైన చర్యలు చేపట్టలేదు. మొక్కలు నాటిన దగ్గర్నుంచి నీళ్లు పోసేలా ఏర్పాటు చేయాల్సి ఉన్నా, పథకం ద్వారా అధికారులు వెసులుబాటు కల్పించలేదు. దాంతో నాటడమే తప్ప నీళ్ల గురించి పట్టించుకోలేదు. మరోవైపు ఆయా మొక్కల చుట్టూ కంచె ఏర్పాటులోనూ నిర్లక్ష్యమే రాజ్యమేలింది. మొర్సుమిల్లి తండా రహదారిలో దాదాపు 800 మొక్కలు నాటారు. అందులో కొంత వరకు కంచె ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం సగం వరకు మొక్కలు కానరావటంలేదు. నీళ్లు పోయటంపై ఎటువంటి చర్యలు లేకపోవటంతో బతికున్న మొక్కలు చాలా వరకు నేటికీ భూమికి జానెడు ఎత్తునే ఎదిగి ఉన్నాయి. వెల్వడం, చంద్రగూడెంలో రహదారుల మధ్య నాటిన మొక్కలకు పూర్తిగా రక్షణ కరవైంది. దాని వల్ల మూడొంతుల వరకు మొక్కలు ఇప్పటికే మాయమయ్యాయి. గతంలో అటవీశాఖ ద్వారా పంచాయతీల ఆధ్వర్యంలో నాటిన మొక్కలు నేడు చాలా వరకు ఎదిగి కనిపిస్తున్నాయి. కానీ ఏడాది క్రితం నాటిన మొక్కలు అక్కడకక్కడే కనిపిస్తున్నాయి. దాంతో నిధుల వ్యయం తప్ప నీడ గురించి ఆలోచన కానరావటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### నీరు పోతకు చర్యలు తీసుకుంటున్నాం

– భాస్కరరావు, ఏపీవో

మండల వ్యాప్తంగా 1100లకు పైగా మొక్కలు నాటించాం. ప్రస్తుతం మొర్సుమిల్లితండా రోడ్డులో మొక్కలకు నీరు పోయించేందుకు వెలుగు మహిళలకు బాధ్యత అప్పగించాం. మిగతా చోట్ల చాలా వరకు మొక్కలు చనిపోయాయి.

## ఈశ్వర్ కుటుంబానికి తెదేపా ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న తెదేపా నాయకులు

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** ఇటీవల మృతి చెందిన తెదేపా నాయకుడు గడ్డమణుగు గ్రామానికి చెందిన అప్పసాని ఈశ్వరరావు కుటుంబానికి ఆదివారం తెదేపా ఆర్థిక సాయం అందజేసింది. తెదేపా జి.కొండూరు మండల ఇన్‌ఛార్జి కంచర్ల రాము, స్థానిక నాయకులతో కలిసి అతని కుటుంబ సభ్యుల్ని పరామర్శించి పార్టీ తరపున రూ. 2 లక్షల నగదును అందజేశారు. 18 నెలల వయసున్న ఈశ్వర్ కుమార్తె తన్విత పేరుతో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ఈశ్వర్ విద్యార్థి సంఘ నాయకుడిగా, పార్టీ ఆదేశాలను అమలు చేసే వ్యక్తిగా ఎదుగుతూ అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ఈశ్వర్ కుమార్తె చదువు పూర్తయ్యేంత వరకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈశ్వర్ భార్య, తల్లిదండ్రులకు పార్టీ పూర్తి అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈశ్వర్ భార్య విద్యార్హతలను అనుసరించి ఆమెకు కూడా ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. నాయకులు ఉయ్యూరు నరసింహారావు, కొల్లి నాగేశ్వరరావు, మంగళంపాటి వెంకటేశ్వరరావు, పజ్జూరు రామకృష్ణ, యనమదల వెంకట్రావు, మంచినీళ్ల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## డప్పు ప్రకాశ్ మృతి తీరనిలోటు

**మైలవరం, న్యూస్‌టుడే:** బహుజనుల అభ్యున్నతి కోసం పోరాడిన డప్పు ప్రకాశ్ మృతి తీరని లోటని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు గాలంకి వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో ఆదివారం పేర్కొన్నారు. తన పాటలతో జాతిని జాగృతం చేశారని అన్నారు. ఆయన అంతిమశ్వాస విడిచే వరకు బహుజన రాజ్యం కోసం పాటుపడ్డారని కొనియాడారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**ఇబ్రహీంపట్నం** : కృష్ణా డెల్టా రైతుల పంటలను కాపాడిన ఘనత తెదేపా ప్రభుత్వానిదేనని, రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర రైతు సంఘ ఉపాధ్యక్షుడు జంపాల సీతారామయ్య అన్నారు. మండల రైతు సంఘ సమావేశం ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 నాటికి పోలవరం పూర్తి చేసే బాధ్యత తెదేపా ప్రభుత్వం తీసుకుందన్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించి చూపుతుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గ రైతులు మూడు పంటలు పండించుకునే అవకాశాన్ని తెదేపా కలుగజేస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రజల పట్ల బాధ్యతతో ప్రతిపక్ష నాయకులు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రైతులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజానికి కృషి



గొల్లపూడి: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

**గొల్లపూడి, న్యూస్‌టుడే:** తల్లిదండ్రులు తమ చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజం కోసం ప్రయత్నం చేద్దామని మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలియో బారిన పడకుండా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కలు వేయించాలని సూచించారు. గ్రామంలోని వివిధ కేంద్రాల్లో వెయ్యి మంది చిన్నారులకు చుక్కలు వేసినట్లుగా ఆరోగ్య శాఖ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ జె.గోపాలకృష్ణ, ఎంపీపీ వి. జగన్మోహనరావు, సర్పంచ్ ఎస్.వెంకటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ సీహెచ్.నాగరాజు, నేతలు జి.పద్మశేఖర్, జి.కె.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. జక్కంపూడి గ్రామం, కాలనీలో గ్రామ సర్పంచ్ కొమ్ము రవి పోలియో చుక్కలు వేశారు. రాయనపాడు, పైడూరుపాడు, కొత్తూరుతాడేపల్లి గ్రామాల్లోను పోలియో చుక్కలు వేశారు.

**మైలవరం, న్యూస్‌టుడే:** మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో సాయంత్రానికి 92 శాతం పూర్తైనట్లు చంద్రాల ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి ఎం.ప్రతాప్ తెలిపారు. మొత్తం 4307 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. 35 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**జి.కొండూరు, న్యూస్‌టుడే** : జి.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 4963 మంది చిన్నారులకు గాను 4372 మందికి చుక్కల మందు వేశామని, మరో రెండు రోజుల పాటు ఇంటింటికీ పర్యటించి మిగిలిన వారికి కూడా చుక్కల మందు వేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి కె.దీప్తి పర్యవేక్షించగా పల్స్ పోలియో ప్రత్యేకాధికారి ఆర్.ఆదినారాయణ కేంద్రాలను పరిశీలించారు. సీహెచ్‌వో కె.ఎ.ప్రసాద్, సూపర్‌వైజర్లు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే:** ఇబ్రహీంపట్నం వైద్యశాల ఆధ్వర్యంలో 4919 మందికిగాను 4797కి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి పద్మావతి తెలిపారు. కొండపల్లి ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో 5021 మంది పిల్లలకుగాను 5001 మందికి చుక్కల మందు అందించినట్లు వైద్యాధికారి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు.

**రెడ్డిగూడెం, న్యూస్‌టుడే:** మండల పరిధిలోని గ్రామాల్లో 95 శాతం మంది చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసినట్లు ఇన్‌ఛార్జి వైద్యాధికారి డాక్టర్ ఎన్.వీరయ్య చౌదరి తెలిపారు. 3047 చిన్నారులకు గాను 2906 మందికి పోలియో చుక్కలు వేశారు. 31 కేంద్రాలు, 124 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. రెడ్డిగూడెంలో సర్పంచి ఉయ్యూరు అంజిరెడ్డి పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ కె.సూర్యకుమారి, నాయకులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, పి.కిరణ్‌కుమార్‌రెడ్డి,జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



జి.కొండూరులో నృసింహస్వామి గుట్ట వద్ద నిలిచిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

## అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం

**జి.కొండూరు, న్యూస్‌టుడే:** జి.కొండూరు బీసీ ప్రాంతంలో నృసింహస్వామి గుట్ట వద్ద నిధుల లేమితో అంగన్‌వాడీ భవన నిర్మాణం నిలిచిపోయింది. గతంలో జిల్లా పరిషత్ నుంచి రూ.4.25 లక్షలు మంజూరుకాగా స్లాబ్ వరకు నిర్మించారు. కేటాయించిన నిధులు చాలకపోవడంతో నెలల తరబడి నిర్మాణ పనులు సాగక అసంపూర్తిగా నిలిచింది. భవనానికి చుట్టూ గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, గదులు, మరుగు దొడ్డి నిర్మించాల్సి ఉంది. ఈ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలోని అంగన్‌వాడీ చిన్నారులకు భవనం సమకూరుతుంది. భవన నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.3 లక్షల నిధుల కోసం మండల పరిషత్ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని, నిధులు మంజరైన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.